శనివారకథ

కళంకం

— వి. ప్రతిమ

దండాల్సామే...నమస్తేసా... నా పేరు యెంకటమ్మ... ఈ హోల్‌మొత్తం బంగారం పేటకి నేను 'యెంకటి'నే కానీ... నిజంగా బంగారాన్ననే పేరు తెచ్చుకున్నాసా... ఆ పోలేరమ్మ సాచ్చిగా సెప్తా వుండాను. నేను ఒక్కరి చేత ఒక్క మాటన్పించుకోకుండా అంత గొప్పగా బతికినానండా... ఎవురయినా సావడానికి పోతా పోతా అపద్దం చెప్తారా సెప్పండి. మా రెడ్డమ్మయితే నన్ను అంతా యిదిగా మెచ్చుకుంటాది. నెత్తి మీద గింజ నేలబడి నేనీ వూరికొచ్చింది మొదల్సేసి ఆయమ్మ దగ్గిరే పన్జేస్తుండానే, ఆయమ్మకి తెలవదా నా సంగతి. తెలవకపోతే ' యెంకటి మాలోళ్లల్లో పుట్టాల్సిందే కాదు అంతా మంచి బుద్ధి దానికి... గొప్పింట్లో పుట్టాల్సిన మనిషి' అని అంత గొప్పగా దేనికి సెప్తాది... ఆయమ్మ ఆ మాదిరిగా సెప్తా వుంటే నాకు కోడి కూర నంజుకొని సంగటి తిన్నంత ఆనందంగా వుంటాది.

మశూరాలు శేరు నాలుగు రూపాయలమ్మిన్నాటి నుండీ ఈ పొద్దుటి దాకా ఏనాడయినా ఆయమ్మ యింటికి పనికి పోకుండా వుణ్ణానా? ఆయమ్మ కాల్తో చెప్పిన పని సేత్తే సేసుకుపోతినే... ఏ పొద్దయినా ఒక్కమాట ఎదిరిచ్చి ఎరిగుందునా? ఏ పూటయినా అది పెట్టలేదు, ఇది పెట్టలేదని మాట్లాడి వుందునా? ఆయమ్మ ఏది చెప్తే అదే నాకు బారతం, రామాయిణం.

ఇదిగో ఈ పనికిమాలిన ముండ పుట్టినప్పుడు దీనికి 'అరుణ' అని పేరు పెట్టింది ఆయమ్మే కదా. మాకెందుకు తల్లా అట్టాటి పేర్లు ఏదో రంగమ్మ, చెంగమ్మ, పెంచిలమ్మ అని పెట్టుకుంటానంటే ఆయమ్మ ఒప్పుకున్నాదా? 'ఎంతసేపూ ఆ పేర్లే ఎందుకు పెట్టుకోవాలే... మీరు మాత్రం మంచిపేర్లు పెట్టుకోకూడదా ఎవురు చెప్పారే? ఎక్కడుందా రూలూ?'' అనింది.

''వొద్దమ్మా మా యిళ్ళల్లో ఎగతాళి చేస్తారు'' అంటే ''ఎన్ని రోజులు చేస్తారే!... ఒకరోజు చేస్తారు, రెండు రోజులు చేస్తారు... ఆ తర్వాత చేస్తారా?'' అంటూ రూల్సూలు మాట్లాడింది. ఆయమ్మ 'అరుణా' అని ముద్దుగా దీన్ని పిలుస్తూంటే గొప్పింటి బిడ్డ మాదిర్నే అన్పించేది ఈ పిల్ల... యాం చేస్తాం గొప్ప పేరు పెట్టుకుంటే మాత్తరం గొప్ప బుద్ధులొస్తాయా? అంతా నా కర్మ.

మొదుటి 'కాడి' నేరుగాపోతే యెనక 'కాడి' గాడి తప్పదంటారు. అట్టా మొదుటోడు సరిగ్గా వుంటే నాకు అంతా సరిగ్గా వుణ్ణు. కట్టుకున్నోడు తాగి తాగి చావ బాదతా వుంటే బిడ్డలన్నా కడతేరస్తారనే ఒక యిదితో బతికితినే... బిడ్డల్ది యింకా జాస్తిగా వుండాదే సామే... ఒకందాన రాయలేదు నాకా బగమంతుడు.

ఎప్పుడయినా, ఎన్ని బాధలొచ్చినా పెద్ద రెడ్డోళ్ళని ఎదిరిచ్చి వుందునా? ఇప్పటి కాలప్పిలకాయిలు ఏం చేస్తా వుండారో, ఏం చేస్తా వుండారో నాకేమీ తెలవడం లేదు. వోళ్ళు బంగాళాల్లో దేనికుండాలా? మనము ఈ గుడిసెల్లో దేనికనేసుండాలా అని అడగతారు. వోళ్ళకి మాత్రం అన్నెకరాల నేలుండేదేంది?... మనకసలు నేలే లేదేంది? అనడగతారు. అసలు నాకు తెలపకడగతానూ బంగాళాల్లో పుట్టినోళ్ళు బంగాళాల్లోనే కదా వుంటారు. గుడిసెల్లో పుట్టినోళ్ళు గుడిసెల్లోనే కదా వుండాల. కాలిగోళ్ళు తలెంటికల్తో ఎట్టా పోటీపడ్తాయి. ఈ పిలగాళ్ళకేమీ ఒళ్ళు తెలీడం లేదు. ఎగిరెగిరి పడ్తా వుండారు. ఎప్పుడో దబ్బున కూలబడబోతారు.

కోడికూసే యేళకి లేసి రెడ్డోరింటికి బోతే రేత్రి తొమ్మిది గంటల బస్సొచ్చే దాకా వంచిన నడుమెత్తకుండా పన్జేసు కుంటా నా పాటకి నేను బతకతా వుంటినే. ఇప్పుడేంది సామే యిట్టాటి కష్టమొచ్చేసింది నాకు. ఇప్పుడేం జేయాల తల్లా నేను. కళ్ళకు గంతలు కట్టేసి నట్టనడి రోడ్డు మీద వొదిలేసి నట్టుగా అయోమయంగా వుండాది నాకు.

ఆ రెడ్డోరబ్బయ్యకి పెపంచంలో యింతమంది ఆడోళ్ళుండగా మా అరుణమ్మే కంటక్కనబడాలా?... ఖర్మ కాకుంటే... ఒకాళ ఆయబ్బయ్యేందో వయసు మీదుండాడు కావాల్సి మాట్లాడిచ్చినాడనుకో దీనికయినా బుద్ధనేదుండబళ్ళా?... మనమేంది? వోళ్ళేంది? పేమలేంది ధేమలేంది అని కొంచెమయినా అలోచించుకోవాల్సిన పళ్ళేదా? పోయిన సంవస్సరం కాడ్సించి ఈ సూపులన్నీ చూసి చూసి, యిహన రెడ్డోరబ్బయ్యనేవీ అన్లేక దీన్ని చావబాదితిని... ఇహన యిట్టా గాదన్చెప్పి నా తమ్ముడ్ని బతిమాలి, బామాలి వాడికిచ్చి అరుణమ్మని కట్టబెట్టేస్తిని... సరే మంచో, చెడో మూడుముళ్ళు బడిపోయినయి, దాని పాటికది వాళ్ళూరికి బొయ్యి కాపరం చేసుకుంటుందానిని వొదిలేయొచ్చు కదా. ఆ సురేషయ్య అంతటితో గమ్మునుండకుండా దానత్తగారూరికి పొయ్యి ''అరుణా నాతో గూడ వస్తావా రావా?'' అని పిలిసినాడంట... దాని మొగుడప్పుడు పనికి పొయ్యున్నాడంట.

ఈ యెర్రిముండ, పనికిమాలిన ముండ, కొవ్వుబట్టిన ముండ దాన్నెత్తిన ఏ శని దాపరించిందో, ఏ పురుగు తొలిచిందో, దాని టైమట్టుండాది వేడితే గూడ బడిపొయ్యిం దంట.

ఇదంతా రెడ్డిగోరికి తెలిసి పొయ్యుండాది. రెడ్డసాని నన్ను పిలవనంపింది.

''ఏమే యెంకిటా?... నేన్నీకేం ద్రోహం జేస్తినే... ఎట్టెట్ట జూసుకున్నాన్నిన్ను... నా నోట్లోకి పోయేది నీ చేతిలో బెడ్తిని కదే. 'అరుణ' అని నేను సొయంగా పేరుపెట్టి ఆయమ్మికి నా కొతురి గుడ్డలన్నీ కట్టబెడ్తినే... నువు పన్లోకి పంపిస్తానంటే వొద్దులేయే సదూకోనిమ్మంటనే, ఇదేనా నాకు మీరు చేయాల్సిన శాస్తి...'' అంటూ ఏందేందో మాట్లాడేసింది. నాకేవీ అర్థం కాకపాయ.

ఏ పొద్దయినా ఆయమ్మ నన్ను తిట్టిరుగుణ్ణా... ఈ చెడబుట్టిన ముండదానిచేత ఎన్నెన్ని మాటలడి గించుకుంటా వుండాను వూరందరి చేత. రెడ్డోరింట్లో కరు డైవోరు మొదులుకొని వాచిమేను రంగయ్య దాకా అందురూ ఎన్నెన్ని మాటలడిగినారు. కడుపుకు కూడు దింటుండావా లేదా అన్నారు. స్వామి ద్రోహం చేస్తే వచ్చే జనమకి ఈ పుట్టేకూడు కూడ పుట్టదన్నారు. రెడ్డయితే దాంతో ఏందిరా మాట్లాడేది 'ద్రూ' అని నా మీద ఎంగిలూసి గేటు అవతలికి నెట్టించేసినాడు.

అప్పటికప్పుడు మాయమ్మోళ్ళూరికి పరిగెత్తితిని. మాయమ్మ ముసిలిముండ బయట కుక్కి మంచంలో

పొడుకొని గొణుగతా ఏడ్చుకుంటా వుండాది. లోపలికి బోతే తమ్ముడు ఒక్కడే సాప మీద పడుండాడు మొహానికి చెయ్యడ్డం పెట్టుకొని.

'ఏమయిందబయ్యా' అని అడిగితే యాడ తంతాడోనని బయపడ్డాను. ఎంతయినా తోడబుట్టినోడు కదా. నేనొచ్చింది చూసి 'కూచోక్క' అన్నాడు.

నాకేం మాట్లాడాలో తెలీకపాయ.

''నువ్వీ పెళ్ళి చేసుండాల్సింది గాదక్కా'' అన్నాడు వాడే కాసేపటికి. ''గుర్రాన్ని నీళ్ళ కాడికి లాక్కుపోగలమే గానీ నీళ్ళు తాగించగలమా చెప్పు?''

''అవును నాయినా నీ బతుకు పాడు జేసిసినాన్రా'' అట్టంటుంటే నాకు తెలీకుండానే ఎక్కిళ్ళు పెట్టుకొని ఏడుపొచ్చేసింది. ''నన్ను గురించి ఎన్ని బాదలు పడ్తుండావురా అబయ్య'' అన్నాను మళ్ళీ.

''బాధలేందే వూరంతా ఎన్నెన్ని మాటలడగతా వుండారో తెలుసా? యిన్నేక సెవులు మూసుకుంటుండాము. బిడ్డ పనికిపోయి కూడ నాలుగు దినాలయిపోయింది.'' అనింది మాయమ్మ. నేనొచ్చిన సంగతి గెమనించి మెల్లిగా లోపలికొచ్చిండాది. '' ఇహన అది తిరిగొస్తే కూడ ఈ యింటిగ్గా దాన్ని రానిచ్చేదానికిలే'' అన్నది.

తమ్ముడు కూడా అంతేనన్నట్లుగా వుండాడు.

దాని బుద్ధి తెలిసుండి కూడా నా బంగారంట తమ్ముడు యెంకటయ్యకి దాన్ని కట్టబెట్టడం నా తప్పే. ఏం చేసేదిరా బగమంతుడా అని యేడస్తా ఆ పొద్దంతా అక్కడ్నే వుండిపోయినా. మా వూరికి పోయే దానికి మొహం చెల్లకుండా.

ఆ పొద్దుటికి మూడు దినాలయిపోయింది... ఈ ముండ కన్నా బిడ్డ యింటికాడ్సించి యెల్లిపోయి... మల్లా నాలుగు దినాలు పోయిన పాట నా కొడుకొచ్చినాడు నన్ను యెతుకులాడుకుంటా.

'' ఏందిమా యింటికి రాకుండా ఈడ్నే వుండావు'' అన్నాడు.

దానిక్కూడ ఏడుపు తప్ప యింకేం రాలేదు నాకు. అవతల వోడే చెప్పుకొచ్చినాడు.

''రెడ్డోరి మనుషులు అంతా యెతుకులాడి ఆడెడ్నే తిరపతి అవతల లాడ్జిలో వుణ్ణారని సురేషయ్యనీ, అక్కనీ తీసుకొచ్చినారు. నాయిన్ని పోలీసోళ్ళు తీసకపోయి టేసన్లో యేసుండారు. అక్క ఒకిటే వుండాది యింటికాడ. నువు రామా పోదాం'' అంటా యింటికి పిలసకపాయ.

దాని మొహం చూడాలంటేనే మండిపోతుండాది నాకు. పోతానే కొరివి కట్టొకటి తీసుకొని చావబాదాలనుకున్నా... రెడ్డోరు దయతల్చి పోలీసోళ్ళతో చెప్పి మా యింటాయిన్ని వొదిలేయిస్తే వూళ్ళోనే వుండకుండా యాడయినా దూరంగా పోయి పడుంటామనుకున్నా. ఇన్ని ఆలోశన్లూ సేసుకొని నేనింటి కాడికి పొయ్యేటప్పటికి సామే నా యింట్లో పెద్ద పెద్ద మాటలు జరిగిపోతా వుండాయి. మీ బాసలో సెప్పాలంటే రాజకీయాలు సామే. అయ్యో యినటానికి కూడా నాకు ఆగిత పళ్ళేదయ్యా.

కాపోళ్ళ రవిబాబు మా వాకిట్లో కుర్సీ యేసుకొని కూకోనుండాడు. యెంకట్రాజు కొడుకు సుధాకర్రాజు గుడిసె వాకిట్నో నిలబడి లోపలికి సూస్తా వుండాడు. అప్పటికే మా యింటాయిన్ని ఎవురు బయటికి తీసుకొచ్చినారో, ఏమో తెలవదుగానీ లోపల కింద సాపమీద కూకోని కూతురితో ఏందో సెప్తా వుండాడు.

ఇయ్యంతా ఏందో, ఈళ్ళంతా యేమేం మాట్లాడు కుంటుండారో, ఏమీ జరగతా వుండాదో నాకేవీ తెలవలే...

ఇంతలోపలికి మా వోళ్ళబ్బయ్య కస్తూరి గొట్టుపల్లి నుండి ఎనిమిది గంటల బస్సుగ్గావాల దిగినాడు. వోడు వోళ్ళూరికి పెసిడెంటుగా వుండాడు. మా కులపోళ్ళకి ఎక్కడ ఎవురికేం అన్యాయం జరిగినా నేనుండానంటూ వచ్చేస్తాడు. మనిషి మంచోడు. అందరినీ అక్కరగా జూస్తాడు.

కస్తూరయ్య రావడం చూసి సుధాకర్రాజు ఎదురుపోయి ఏందో మాట్లాడినాడు. అందుకు కస్తూరయ్య కూడా ''అట్నే చెయ్యాల్సిందే'' అంటా తలూపుతుండాడు.

నేను నిలువుగాళ్ళ మీద నిలబడే వుండాను.

నిలువు గుడ్లేసుకుని సూస్తానే వుండాను. నేనొచ్చిన సంగతి కూడ చూడనట్లుగా అందురూ అరుణమ్మని తీసుకొని బయల్దేరారు. అంతా యాడకి పోతుండారో నేనెరగను. నా మొగుడిక్కూడ నేను కంట్లో నలుసయిపోయినాను. పెద్ద మొనగాడి మాదిరి వోళ్ళందరితో గూడ చేతులూపుకుంటా పోయినాడు. నా కొడుకయితే సినిమాలో ' ఈరో' మాదిరిగానే అనుకుంటుండాడు. నేను నిరామయంగా సాప మీద పడిపోయినాను. ఒళ్ళంతా సలవలు కమ్మినట్టయి పోయింది నాకు.

ఆ మద్దినేల మూడు గంటలయ్యింటాది. నరసమ్మొదినె వచ్చి నన్ను నిద్ర లేపింది. ''లెయ్యి యెంకటా యిదిగో ఈ గెంజి నీళ్ళయినా తాగు. పొద్దనెప్పుడు బయిదేల్నావో ఏమొ. ఇట్ట తినకుండా, తాక్కుండా ఎన్నాళ్ళుంటాం చెప్పు...'' అంటా నాచేత గెంజి తాగిచ్చింది.

నేను మెల్లగా లేసి కూచ్చోని గెంజి తాగినాను. మళ్ళా నరసమ్మే చెప్పింది. ''యెంకటా మనకెందుకుమే పెద్దాళ్ళతో.. ఏదో అయ్యింది పొయ్యింది గుట్టుగా అరుణమ్మని మీ అమ్మోళ్ళింటికంపేయంగూడదా? ఇయ్యేవన్నా సినిమాలా చెప్పు. వోళ్ళింటి ముందు పోయి కూసోని తిండి, తిప్పలూ లేకుండా పోరాటం చేయటానికి. అరుణమ్మి ఎన్ని రోజులిట్టా కూడూ, నీళ్ళూ లేకుండా కూసుంటే మాత్రం పెదరెడ్డి మనసు కరగతాదా? ఆ యింటి కోడల్ని సేసుకోడానికొప్పుకుంటాడా చెప్పు? అయ్యంతా జరిగే పన్లు కాదులేమే...

ఇట్టాటియన్నీ పొర బైటికి రానీకుండా మనలో మనం మింగుకోవాలా... ఇన్నేళ్ళుగా వోళ్ళ వుప్పూ, పులుసూ తిని బతికితిరే అట్టాటి రెడ్డసానికి మనమే ద్రోహం చేయొచ్చునా?... ఆలోశన సెయ్యియే''

నరసమ్మ చెప్పింది యినేతలికి నాకు నోట్లో చెమ్మలేదు. ఉణ్ణెట్టుండి కడుపులో తిప్పతా వుండాది. తల పగిలిపోతా వుండాది. నరసమ్మ చెప్పింది నాకేమీ ఆగిత పడ్డం లేదు.

'' ఏందా? నా కూతురు అరుణమ్మి పెద్దరెడ్డి కోడలా?... సురేషయ్య భార్యా?... యాడనయినా వుండాదా ఈ కత... ఈ కాలప్పిలకాయిల బుద్ధులే మారిపోతా వుండాయి. మనమేడ, వోళ్ళేడ అనే యోశనే చెయిడం లేదయా ఈళ్ళు. ఈళ్ళెంతనుకుంటే అంతే. ముందూ యెనకా లేదు. మా అరుణమ్మి ఆ యింటి కోడలా?

ఆ యింటికి ఎట్టాటమ్మి కోడలుగా రావాలని మా రెడ్డమ్మ కలలు కంటా వుణ్ణిందే నాకు తెలుసు... రెడ్డమ్మ అన్న కూతురు శిల్పమ్మ నిజంగా చెక్కిన బొమ్మతో పాటుంటాది. సన్నంగా, తెల్లంగా, పొడుగ్గా పిండిబొమ్మ మాదిరి ఒంటి నిండా నగల్తో, పెద్ద చదువుతో, చెప్పటానికి లేనంత ఆస్థిపాస్తుల్తో... అట్టాటి బొమ్మ ఈ పెదరెడ్డింట్లో తిరుగులాడతా వుంటే ఆ బంగాళాకి తగినట్లుగా ఎంత దీటుగా వుంటాది. అ యింటికే కళొచ్చును గదా... ఆ కలలన్నీ తుంగలో తొక్కిపారేసి ఈ సురేషయ్య ఎంత పని చేసేసినాడు. చేస్తే సేసినాడనుకో ఈ అరుణమ్మికయినా బుద్ధీ, సిగ్గూ వుండబళ్ళా?... చేసిన సిగ్గుమాలిన పనికి తోడు వోళ్ళింటి ముందర కుచ్చోని పోరాటం చేసేసింది. మవున పోరాటం... మాయా పోరాటం... ఏందమ్మీ యిదంతా.

నేనీతో పాటుగా యోశన చేస్తుండేలోపల్నే కస్తూరయ్య, మా యింటాయినా సుధాకర్రాజూ అంతా వొచ్చినారు.

అరుణమ్మి రాలేదు. కస్తూరయ్య నా పక్కన్నే వచ్చి కూర్చున్నాడు.

'అక్కా! యిదే మనకి మంచి అవకాశం. పేళ్ళయి సంసారం చేసుకుంటున్న బిడ్డని లేపుకుపోయి పద్దినాలు కాపరం జేసి తీసుకొచ్చినాడు. ఈ పొద్దు దాన్ని పంపిస్తామన్నా దాని మొగుడేలుకునేట్టు లేదు. నిజమా కాదా నువు చెప్పక్కా. ఆయమ్మి బతుకంతా ఎట్టగడవాల. నువు ఎల్లకాలమూ వుండి ఎల్లీదగలవా? అందుకే నీ కొడుకునీ, మీ యింటాయిన్నీ దీసుకొనీ కలెట్రు కాడికి పోదామనుకుంటుండాను.''... కాసేపు ఆపినాడు కస్తూరయ్య.

ఉస్సూరంటూ ఊపిరొదిల్నాన్నేను. నాకు దీనికంతటికీ ఏమని జవాబు చెప్పాలో తెలీడం లేదు. మనమేంది? కలెట్రు కాడికి పొయ్యేదేంది? ఈ పూటకి గతిలేదు. ' ఓ' అంటే 'న' రాదు. కలెట్రు దగ్గరికి పోతారంట కలెట్రు దగ్గిరికి. సెప్పేదానికయినా వుండాల, యినేదానికయినా వుండాల.

నేను గమ్మనే వుండడం జూసి కస్తూరయ్యే చెప్పినాడు మళ్లా.

''అక్కా దీని కంతటికీ మనకేం బయం లేదక్కా... అంతా ఆ మధుసూధన్నాయుడే చూసుకుంటా నన్నాడు. ఇదిగాని జరిగిందంటే నీ కూతురు ఆ యింటి కోడలయిపోతాదనుకో...''

'' ఇహన మనకేం గావాల చెప్పే... అరుణమ్మి రెడ్డి కోడలయిపోతే మనమూ, రెడ్డోళ్ళూ అందరం కలిసిపోతాం. అందుకనేసి కలెట్రు దగ్గిరికి పోతుండాం న్యాయం జరిపించమని'' మా యింటాయిన నన్ను ఉబ్బేయాలని సూస్తుండాడు.

కూతురు గొప్పింటి కోడలయితే తాగడానికి డబ్బులు చేతినిండా వుంటాయనుకుంటుండాడే గానీ... పరిస్థితేందా అని యోచన చెయ్యడం లేదా మనిషి. ఆ మధుసూద న్నాయుడికీ, మా పెదరెడ్డికీ మొదుట్నించీ తగువులే. యాపారాల్లోనే గాదు రాజకీయాల్లో గూడ శత్రువులే. ఈ సురేషబయ్య చేసిన ఈ పనికిమాలిన పనిని లోపంగా చేసుకొని రెడ్డిని ఎట్టయినా తొక్కేయాలని చూస్తుండాడు ఆ నాయుడు. అందుకే చిన్నదాన్ని పెద్దదిగా చేస్తుండాడు. నడవ మనల్ని అవసరానికి వాడుకుంటుండారని అర్థం కాబళ్ళే ఈయనకి. సంకలెగరేస్తా వుండాడు నా బట్ట కలెట్రు దగ్గిరికి పోడానికి. ఆ నాయుడు చిన్న మనిషా?.. ఈ పెదరెడ్డి చిన్నటోడా... ఇద్దరి సందన దూరుకొని నలిగి సావటానికి చేస్తుందారిదంతా...

నా కొడుకూ, వాడెబ్బా, కస్తూరయ్యా, సుధాకర్రాజూ అంతా నేనేం చెప్పబోతానా అని చూస్తా వుండారు. నేను మాత్రం ముందూ యెనకా సూడకుండా ఖచ్చితంగా చెప్పేస్తిని. నా మొగుడి సాయా, కొడుకు సాయా చూడకుండా.

''అబయా కస్తూరీ.... మీకు కొంచెమయినా అలోశ నుండాదా? నక్కకీ నాగలోకానికీ పొత్తేడ కుదరద్దీ. మనమ్మేంది వాళ్ళింట్ల కోడలయ్యేదేంది? మీకంతా పిచ్చిగానీ పట్టలేదు గదా. రెడ్డి మనమ్మిని బతకనిస్తాడను కుంటుండారా?... నట్ట నడీధీలో పెట్టి నరికి పారేస్తాడు. చెప్పేదానికిలే.... రేపు నాయుడు రెడ్డీ ఒకటయిపోయి మనల్ని పులుసులో కరేపాకు నేరినట్టు ఏరిపారేస్తారు.

అట్టాటివంతా జరిగి మనందరం కూలబడి ఏడవడం కన్నా యిప్పుడే గుద్దా, నోరూ మూసుకొని గమ్మున పడుంటే బాగుంటాది. యాడికబయ్యా మీరు కలెట్రు దగ్గరికి పొయ్యేది.... కలెట్టరు దగ్గరికి పోతారంట కలెట్రు దగ్గిరికి....'' యిదిల్చి పార్సాకినాను అందర్నీ.

నా మొగుడు, కొడుకూ నోరు తెరిస్తే ఒట్టు... కొడుకు నా తట్టు మిటకరించి చూస్తుండాడు.... ఇదే అదునుగా

మిగతా 13వ పేజీలో

తెల్ల వెంట్రుకలను నల్లబరిచే గుంట గలిజేరు

గుంట గలిజేరు, గుంట గగర, గలగర అనే పేర్లు గల మొక్క పల్లెల్లో బాగా కనిపిస్తుంది. నిల్వ వున్న నీటి చెలమలు, గుంటలు, పొలాల గట్ల వద్ద, తేమ వుండే ప్రదేశాలలో ఎక్కువగా పెరుగుతుంది. నీరు నిలిచి వుండే బురద ప్రదేశాలలో సంవత్సరం పొడవునా దొరుకుతుంది. ఇది ఏక వార్షిక మొక్కయినందువల్ల, తొలకరి వానలు పడగానే మొలకలు పెరిగి, ముదురు ఆకుపచ్చ ఆకులతో, తెల్లటి పుష్పాలు, గుంపుచేరి, పళ్ళెం లాంటి కాడ కొనభాగం మీద ఏర్పడి మెరుస్తూ వుంటాయి. ఈ మొక్కను పెరటి తోటలలో కూడా కొమ్మలు తుంచి, వేరు వున్న మొక్కలను నాటి పెంచవచ్చు. తల్లి వేరు పొడవుగా, బోలుగా వుంటుంది. కణుపుల వద్ద అక్కడక్కడా అబ్బురపువేర్లు పుట్టి, నేలమీద వ్యాపిస్తూ పెరుగుతుంది. దీన్ని సంస్కృతంలో 'భృంగరాజ్' అని, శాస్త్రీయంగా 'ఎక్లిప్టా ఆల్బా' లేక 'ఎక్లిప్టా ఆల్బా' లేక 'ఎక్లిప్టా ప్రోస్ట్రేటా' అని పిలుస్తారు. ఇది 'ఆస్టరేసి' కుటుంబానికి చెందినది. ఈ మొక్కలోనే నలుపురంగు కాడలున్న నల్ల గలిజేరు అనే రకం కూడా దొరుకుతుంది. రెండింటికి ఇంచుమించు ఒకే లక్షణాలున్నాయి.

ఈ మొక్కలో 'ఎక్లిప్టిన్' అనే ఆల్కలాయిడ్, రెసిన్, ఐరన్, వెడిలో లాక్టోన్ అనే ముఖ్యమైన రసాయనిక పదార్థం వున్నాయి.

ఆయుర్వేదంలో ఈ మొక్కకు 'తిక్త' రసము, ఉష్ణ 'కటు' విపాక గుణాలున్నట్టు పేర్కొన్నారు. పత్రాలకు, వేర్లకు, పైత్యరసాన్ని, జీర్ణాశయం లోనికి చేర్చే శక్తి వున్నట్టు తెలుస్తోంది. దేశీయ వైద్యంలో ఈ మొక్కను 'బ్రెయిన్ టానిక్, హెయిర్ టానిక్' గానూ వాడతారు. ఆయుర్వేదంలో గుంట గిలజేరు మొక్కను లివర్ టానిక్ గానూ, ముఖ్యంగా కామెర్ల వ్యాధికి, పిత్తాశయ వ్యాధులకు ఇస్తారు. మొక్క సమూలంతో, వాము కలిపి నూరి కాలేయపు వాపు, కీళ్ళ వాపు, జ్వరం, నొప్పులు తగ్గడానికి ఇస్తారు. తామర వ్యాధి నివారణకు పైపూతగానూ, విరేచనకారిగా లోనికి ఇవ్వడమే గాక, కంటి పొర కరగడానికి, వేరు నూరి కంటికి కాటుక లాగా పెడతారు (దేశీయ వైద్యం).

దగ్గు, జలుబు తగ్గడానికి, పత్రాలతో, తులసి, కప్పురిల్ల, బొక్కెనాకు కలిపి, వాడ్చి, రసం తీసి లోనికి ఇస్తారు (గిరిజన వైద్యం). మొక్క నూరి, చిటికెడు హారతి కర్పూరం కలిపి

> గుంట గలిజేరు మొక్క సమూలం రసం తీసి, నువ్వుల నూనెలో వేసి కాచి, తలకు రాసుకుంటే తెల్ల వెంట్రుకలు నల్లబడటమే కాకుండా జుత్తు పూడటం తగ్గి, ఒత్తుగా పెరుగుతుంది. తలనీలాలు ఇచ్చినవారు వెంట్రుకలు త్వరగా పెరగాలంటే గంటుగలిజేరు రసం తలకు పూసుకొని మరుసటి రోజు తలస్నానం చేస్తూ పక్షం రోజులు చేస్తే త్వరగా, వత్తుగా జుత్తు పెరుగుతుంది.

గజ్జి వలన వచ్చే దురదలకు పూస్తే దురదలు తగ్గుతాయి. విత్తనాలు ఏవిధంగానైనా లోనికి తీసుకుంటే లైంగిక సామర్థ్యం పెరుగుతుంది. గుంట గలిజేరును పచ్చడి చేసుకుని తింటే జీర్ణకోశ వ్యాధులు, కడుపులో మంట తగ్గుతుంది.

జంతువుల మీద చేసిన ప్రయోగాలలో గుంట గలిజేరు కాలేయ వ్యాధుల చికిత్సకు మంచి ఔషధమని కనుగొన్నారు. ఆల్కహాల్‌లో కరిగించిన మొక్క ద్రావణాన్ని 'రానికెట్' వ్యాధిని కలిగించే వైరస్‌ను నాశనం చేసే శక్తి వున్నదని కనుగొన్నారు.

మహారాష్ట్రలోని గ్రామీణులు, మొక్క సమూలం రసం తీసి, మసాలా దినుసులు కలిపి టానిక్‌గా తీసుకుంటారు. వారానికి ఒకసారి రసం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని అంటారు. బిడ్డలకు కడుపులో వుండే నీరు, మైల బయటికి రావాలంటే రెండు చుక్కల తేనెలో రెండు చుక్కల రసం కలిపి నాకిస్తే మంచిదని అంటారు. గుజరాత్, పంజాబ్ రాష్ట్ర గ్రామీణులు ఈ రసాన్ని పశువులకు తగిలిన దెబ్బలకు, పుండ్లకు పైపూతగా ఉపయోగిస్తారు. చోటా నాగపూర్‌లో పశువులకు వచ్చే కంటి ఎరుపు, కంఠ వాపునకు త్రాల రసం ఉపయోగిస్తారు. చైనాలోఈ మొక్కను బంక విరేచనాలు తగ్గడానికి, రక్త స్రావం ఆపడానికి, చిగుళ్ళు గట్టిపడటానికి ఔషధంగా ఉపయోగిస్తారు. నొప్పి, వాపు తగ్గడానికి కూడా పత్రాల సాన్ని చిగుళ్ళ మీద రుద్దుతారు. ఇండో-చైనాలో ఆస్త్మా, ఊపిరి తిత్తుల అలెర్జీ నివారణకు దీన్ని ఉపయోగిస్తారు. శ్రీలంక వాసులు దీనికి రక్తాన్ని శుభ్రపరిచే గుణముందని విశ్వసిస్తారు. అందుకోసం వీరు దీన్ని నీడలో ఎండించి, చూర్ణం చేసి, రోజూ తీసుకుంటారు (కీర్తికర్ అండ్ బసు).

తెల్ల వెంట్రుకలు నల్లబరచడానికి....

గుంట గలిజేరు మొక్క సమూలం రసం తీసి, నువ్వుల నూనెలో వేసి కాచి, తలకు రాసుకుంటే తెల్ల వెంట్రుకలు నల్లబడటమే కాకుండా జుత్తు పూడటం తగ్గి, ఒత్తుగా పెరుగుతుంది. పత్రాల పొడిని త్రిఫల చూర్ణంలో కలిపి తీసుకుంటే, ఋతుమార్పులలో వచ్చే వివిధ రకాలైన ఎలర్జీలను నివారించవచ్చు. తలనీలాలు ఇచ్చినవారు వెంట్రుకలు త్వరగా పెరగాలంటే గంటుగలిజేరు రసం తలకు పూసుకొని మరుసటి రోజు తలస్నానం చేస్తూ పక్షం రోజులు చేస్తే త్వరగా, వత్తుగా జుత్తు పెరుగుతుంది.

ఈ మొక్కనుపయోగించి, ఆయుర్వేద (ఔషధాలైన) తైలాలు, 'భృంగరాజ తైలం', 'నీలి భృంగాది తైలం' తయారు చేస్తారు.

–డాక్టర్ యస్. వేదవతి

ఇలాచేస్తేసరి!

★ ఎర్ర గులాబీ రేకులను పాలమీగడలో కలిపి పేస్టులా చేసి పెదవులకు పూసుకుంటే పెదవులు ఎర్రగా, అందంగా కనిపిస్తాయి.

★ మంచి గంధం రాసుకుంటే మొటిమలు తగ్గిపోతాయి.

★ కర్పూరాన్ని చూర్ణం చేసి చల్లితే చీమలు రావు.

★ జాపత్రిని నములుతూ వుంటే నోటి దుర్వాసన తగ్గిపోతుంది.

★ ఐస్‌వాటర్‌లో నిమ్మరసం కలుపుకొని ముఖం కడుక్కుంటే ముఖం తాజాగా వుంటుంది.

★ తుప్పుపట్టిన చోట ఉల్లిపాయతో తోమితే తుప్పు వుండదు.

★ బియ్యం డబ్బాలో చిన్న ఉప్పు మూటగట్టి వేస్తే బియ్యానికి పురుగు పట్టదు.

★ పప్పు ఉడికేటప్పుడు కాస్త నెయ్యి వేస్తే పప్పు త్వరగా ఉడుకుతుంది.

–ఎన్. శివానంద్

రక్త వృద్ధికి మామిడి!

మామిడి శుభసూచకమైన చెట్టు. శుభ కార్యాలకు మామిడి తోరణాలు కడతారు. కలశంలో వాడతారు. మామిడి ఆకు లేనిదే శుభకార్యం జరగదు. మామిడిలో ఉన్నన్ని రకాలు మరే వృక్షాలలోనూ లేవేమో! మామిడి పండు పండ్లకు రారాజు. దీనిని ఇష్టపడని వారు చాలా అరుదుగా ఉంటారు. మామిడి పండు తీయగా, రుచిగా ఉంటుంది. దీనిలో విటమిన్-ఎ, విటమిన్-సి ఉన్నందువల్ల ఇది మంచి పోషకాహారంగా చెప్పవచ్చు. వంటికి బలం వస్తుంది. రక్తం వృద్ధి అవుతుంది. వంటికి కండ పడుతుంది. మలబద్ధకం పోతుంది. నరాల బలహీనత తగ్గిపోతుంది. నీరసంగా వున్నవారు మామిడి పండ్లు తింటే చాలా మంచిది.

మామిడి చెట్టు లోని ప్రతి భాగానికి ఔషధ గుణాలున్నాయి. నాలుగు ఔన్సుల మామిడి ఆకుల రసం, రెండు ఔన్సుల తేనె, రెండు ఔన్సుల పాలు, ఒక ఔన్సు ఆవు నెయ్యి కలిపి రోజుకు మూడు సార్లు ఒక్కొక్క ఔన్సు చొప్పున తాగితే రక్త విరేచనాలు పోతాయి. గొంతుక వాపు పోతుంది. లేతమామిడి ఆకుల్ని ఎండబెట్టి, చూర్ణం చేసి, రోజూ ఉదయమే నీళ్ళలో కలిపి తాగడం ద్వారా మధుమూత్ర వ్యాధిని అరికట్టవచ్చు.

మామి చిగుళ్లను దంచి, రసం తీసి తేనె, యాలుక పండ్ల పొడి కలిపి తాగితే వేవిళ్లు తగ్గుతాయి. ఈ చిగుళ్ళ రసాన్ని పెరుగులో కలుపుకొని తాగితే విరేచనాలు, రక్త విరేచనాలు తగ్గుతాయి. మామిడి చెట్టు బెరడును ఎండబెట్టి, చూర్ణం చేసి, నీళ్ళలో వేచి కాచి, కషాయం చేసి, రోజుకు మూడుసార్లు ఒకొక్క ఔన్సు చొప్పున తాగితే ఎటువంటి రక్తస్రావమైనా ఆగిపోతుంది. పచ్చి బెరడు నుంచి రసం తీసి గుల్ల సున్నం లోని తేట నీళ్ళతో కలిపి రోజుకు రెండు సార్లు ఒకొక్క ఔన్సు చొప్పున తాగితే వారం రోజుల్లో సెగ వ్యాధి తగ్గిపోతుంది.

మామిడి పువ్వుల్ని తేనెలో కలుపుకొని తింటే కడుపులో పిత్తం పోతుంది. ఊపిరితిత్తులలో పేర్కొన్న కఫం సులభంగా బయటకు వస్తుంది. రుచి పుట్టి ఆకలి వేస్తుంది. కంటిలోని ఎరుపు తగ్గుతుంది.

పచ్చి మామిడికాయ రసాన్ని తీసి తాగితే చేపల ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. మాంసాహారం వల్ల అజీర్తి చేస్తే మామిడి టెంక రసాన్ని తాగితే మంచిది.

పాదాలు ఒరిసిపోయి బాధగా వున్నప్పుడు మామిడి జీడి రసంలో పసుపు పొడిని కలిపి రాసుకుంటే ఒరుపులు పోతాయి.

అరికాళ్ళు పగుళ్ళకు మామిడి జిగురును పూసుకుంటే మంచిది.

మామిడి ఆకులు, తెల్ల గలిజేరు ఆకులు, మామిడి వేరును కలిపి చితగ్గొట్టి కషాయం కాచి, దానిలో నెయ్యి వేసుకొని తాగితే వంటికి పట్టిన నీరు పోతుంది. మూలశంక నయమవుతుంది.

బాగా పండిన మామిడి పండ్ల రసంలో తేనె వేసుకొని, ఏలకులు, లవంగాలు, శొంఠి, మిరియాలు, జీలకర్రల పొడిని కూడా వేసుకొని తాగితే మంచి టానిక్‌లా పనిచేస్తుంది. మామిడి తోటల నుంచి వచ్చే గాలి ఆరోగ్యానికి మంచిది.

–జి.వి. రామమూర్తి

కథ 12వ పేజీ తరువాయి

తీసుకొని ఒకే దినంలో పెద్దోళ్లనీ, చిన్నాళ్ళనీ అందర్నీ ఒకటిగా, సరిసమానంగా చేసేయాలని ఉదురు మీదుండాడు వాడు.... పిచ్చి నాయాల వేడికి తెలీడం లేదు యిదంతా అంత తేలిగ్గాదని.

సరే మన అరుణమ్మి వాళ్ళ కోడలు గాకపోయినా, మనం గాన యిట్ట భయపెడ్తే మరింతగా డబ్బులిస్తారని ఆశగా కూడా వుండాది మా ఆయనకి. అందురూ కలిసి మళ్లీ ఏందో మాట్లాడబోయినారు నాతో. నేను పడ్నీలే వాళ్ళని. అంతా గమ్మనయి పోయినారు గానీ, కస్తూరి మాత్రం గమ్మని వుండలేదు...

''అది కాదక్కా మన కలెట్రమ్మ ఆడమనిషి. మనూరి ఎమ్మార్వో ఆడమనిషి... మనోళ్ళామె (మన కులం). యిద్దరూ కూడా వొచ్చినప్పుడ్నుంచీ ఆడోళ్ళకి జరిగే కష్టనష్టాల గురించే జాస్తిగా సూస్తా వుండారు. నీకు తెలవందేముండాది మన ఎమ్మార్వో వచ్చినప్పుట్నుండే కదా ఆడోళ్ళకి పొదుపు లక్ష్మి గ్రూపులని, డ్వాక్రాలనీ అదనీ, ఇదనీ యెంతో మంచిగా చూస్తుండాది. ఆమె కలిగిచ్చుకునిందంటే కలెట్రుతో మాట్లాడి యిద్దురూ అనుకోని న్యాయం చేయాడానికోస్తే రెడ్డేం చేస్తాడు.... ముడ్డేం చేస్తాడు చెప్పు? మనమ్మి జీవితం మనం గదక్కా చూసుకోవాలా. నువు గమ్మన్నే సూస్తా వుండు ఎంత మంచి జరగతాదో'' అంటూ మా యింటాయిన్ని చూసి

నాగలోకం
–మిత్రప్రతిమ

''నువు పద మావా మనం ఎమ్మార్వో కాడికి పొయ్యి మాట్లాడేసి కలెట్రు కాడికి నెల్లూరికి పొయ్యేసొస్తాము. పొద్దుపోయినా పర్వాలేదు రేత్రయితేనే ఆమె యింటికాడుంటాదంట.... పదరా అబయా'' అంటూ అందురూ మాట్లాడుకుంటా బయిటికి పోయినారు.

నేనెవుర్నీ ఏమనీ అపలేకపోయినాను.

''ఆడముండ జెప్తే మనమినేదేందిలే'' అనుకుంటారు మా యిళ్ళల్లో మొగాళ్ళు.

ఇదంతా మంచిగా జరగడం లేదని నా కన్పిస్తా వుండాది. ఆ మధుసూదన్నాయుడికేం బట్టి యిదంతా సెయిడానికి... పెద్దరెడ్డినీ, వాళ్ళ కుటుంబాన్నీ యీదిలోకి లాగాలనే ఒక యిది గాకపోతే... ఆయినకెందుకీ వూసు. ఈ సారి ఎలెచ్చన్లలో పరువు పోయిన పెద్దరెడ్డిని పైకిలెయినీయగూడదని ఒక కచ్చ గాకపోతే...

నేనిట్లా యోచన సేస్తానే వుండాను. చీకటి పడిపోయే. రెడ్డోరి మనుషులూ మా యింటి చుట్టూ తిరగడం కన్పించింది. నేను తలూపేసుకొని, యెనకాల ఒదిగి కూర్చున్నాను. రెడ్డి గమ్మునుండడు. ఏదో ఒకటి చేస్తాడు. ఈ లోపల నేనే ఏదయినా చెయ్యొచ్చు.

అరుణమ్మిని జుట్టు పట్టుకొని లాక్కొచ్చి యింట్లో పారేస్తామనుకున్నాను. కానీ రెడ్డోరింటి కాడికి అడుగు పెట్టాలంటే మొహం చెల్లడం లేదు. నేనే తప్పు చేసినట్లుగా వుండాది భయం.. భయంగా... సరే నా కూతురు సేస్తే ఒకటి, నేను జేస్తే ఒగిటా?...

ఇట్టుండగానే మూడు దినాలయిపాయ... ఇదంతా పేపర్ల కేసినారంట. వూరంతా పొక్కిపోతావుండాది. యాడ జూసినా మా మాటలేనంట. రేపు కలెట్రమ్మా, ఎమ్మారమ్మా వొస్తారంట... నన్నూ, మా యింటాయిన్నీ, పెదరెడ్డినీ, సురేషబయ్యనీ కూడా పంచాయితీకి పిలుస్తారంట...

అయ్యా సామీ ఈ న్యాయం నేన్జెయ్యలేనయ్యా... ఆ రెడ్డెమ్మకి అన్యాయం చేయిలేను. ఆమె వుప్పు తిన్నదాన్ని ఎట్టయితే అట్టవతాది నా కూతురు బతుకు. నాకు నిజంగా యాం చెయ్యాలో తెలీడం లేదు సామీ. వీళ్ళు చెప్పేదంతా జరిగితే నేనింక మా రెడ్డి ముఖం, రెడ్డెమ్మ మొహం చూళ్ళేనయ్యా. ఈ జనమలో.

.... అందుకే యింత రేత్రి పూట పిచ్చిరెడ్డి తోపు కాడుండే పెద్దబాయి కిందకి పోతుండా దూకిసావడానికి... పోతా పోతా కాఫీలో గన్నేరుకాయ నూరి కలిపి అరుణమ్మికిచ్చి పోతుండానయ్యా.

సావడానికి పోతా పోతా ఎవురయినా అపద్దం చెప్తారంటయ్యా.

నేన్చెప్పిందాంట్లో ఒక్కమాట కూడా పొల్లు లేదు సామీ... దండాలయ్యా... నమస్తేసా...

★

వచ్చేవారం కథ

ఎత్తు

– పాటిబండ్ల రజని